## క్లుప్తంగా

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నల్లజర్లలో గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టరు రాజుద్దీన్

**నల్లజర్ల:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని గర్భిణులు ప్రతిరోజు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా తద్వారా తల్లితో పాటు బిడ్డకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటుందని, సుఖ ప్రసవాలు జరిగే అవకాశం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టరు మహమ్మద్ సిరాజుద్దీన్ సూచించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు గ్రామాలకు చెందిన గర్భిణులు పరీక్షించారు. ప్రతినెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రసవ సమయం ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా ప్రతిగ్రామంలో ఉన్న ఏఎన్ఎంలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పలివెల ప్రసాద్, సూపర్‌వైజర్లు రాధాకుమారి, అన్నమ్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

### సుపరిపాలన అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐవీసత్యం

**నల్లజర్ల:** రాష్ట్రంలో నూతన ప్రభుత్వం సుపరిపాలన అందించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. నల్లజర్ల జెడ్పీహైస్కూలులో ఆ సంఘ సమావేశం అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా ఐవీ సత్యం మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం కావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో పెన్షనర్లను తీవ్రమనోవేదనకు గురయ్యారని, ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం దశల వారీగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం ఆలీసాహెబ్, ఇ.ప్రసాద్, ప్రధానకార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరావు, కోశాధికారి ప్రభుదాస్, ఈసీ మెబంరు ఐడీవీ అప్పారావు, ఏసురత్నం, బాలయ్య, నెక్కలపూడి ప్రతాప్, ఝాన్సీ, దత్తు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### యువకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రావిమెట్లలో మృతుడు హరీష్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జనసేన నాయకులు

**నిడదవోలు రూరల్:** రావిమెట్ల గ్రామంలో జనసేన పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీ కడుతూ విద్యుత్‌షాక్‌కు గురై ప్రమాదవశాత్తూ మృతి చెందిన రెల్లి హరీష్ కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు అండగా నిలిచారు. యువకుడికి కుటుంబానికి రూ.1.08 లక్షల ఆర్థిక సాయం చెక్కును జనసేన మండల, పట్టణ అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, రంగా రమేష్, నాయకులు డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి సోమవారం అందజేశారు. నాయకులు బెల్లంకొండ పుష్పవతి, తూరుగోపు సాగర్, గంటా శ్రీను, మోహన్, రాంబాబు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### టేకి మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఏఎంఓ

**కపిలేశ్వరపురం:** టేకి బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల మోడల్ స్కూల్‌గా ఎంపికైంది. జిల్లాలోని టేకి పాఠశాలలో మెరుగైన విద్యాబోధన విద్యార్థులకు అందించేందుకు కృషి చేయనున్నారు. పాఠశాలను సర్వ శిక్షా భియాన్ జిల్లా అకాడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు సందర్శించారు. 13న పాఠశాలను తెరవనున్న నేపథ్యంలో పరిశీలించేందుకు వచ్చినట్టు రాంబాబు తెలిపారు. విద్యాబోధన చేసే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకే ప్రాంగణంలో ఉండటం తదతర కారణాలు నేపథ్యంలో టేకి ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలగా ఉన్నతాధికారులు ఎంపిక చేశారన్నారు.

### నేడు ఎమ్మెల్యే ముప్పిడి పాదయాత్ర

**కొవ్వూరు:** సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేపట్టబోతున్న నేపథ్యంలో సంఘీభావం ప్రకటిస్తూ కొవ్వూరు టీడీపీ కార్యాలయం నుంచి గౌరీపట్నం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఏడుగంటలకు ఈ పాదయాత్ర ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. కావున పార్టీ శ్రేణులంతా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

# దూకుడుకు కళ్లెం

- మైనర్ల డ్రైవింగ్ నియంత్రణకు చర్యలు
- ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోలీసులు
- ఇప్పటి వరకూ 65కి పైగా కేసుల నమోదు



వాహనాలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**కంబాలచెరువు: రహదారిపై నిబంధనలు పాటిస్తూ ప్రయాణించడం అనేది వాహనచోదకుల సమష్టి బాధ్యత. ప్రతి ఒక్కరూ వాటిని సక్రమంగా పాటించినప్పుడే** ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. ఎటువంటి ప్రమాదం లేకుండా గమ్యానికి చేరుకోగలం. సాధారణంగా డ్రైవింగ్ లైసెన్సు ఉన్న వారందరికీ రోడ్డు నిబంధనలపై అవగాహన ఉంటుంది. కానీ మైనర్లు నిబంధనలు పాటించరు. వేగంగా వాహనం నడపాలనే ఆలోచనతో అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్లు వాహనం నడపడం చట్టరీత్యా నేరం.

**పెరిగిన రోడ్డు ప్రమాదాలు**

ఇటీవల రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. వీటిలో అనేక మంది మృతి చెందుతున్నారు. చాలామంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆయా ప్రమాదాలలో మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగినవి కూడా ఉంటున్నాయి. అవగాహన లేని వయసు, ఉరకలేసే ఉత్సాహంతో మైనర్లు అతి వేగంగా వాహనాలను నడుపుతున్నారు. వేగంగా వెళుతున్నామా, లేదా అనే విషయం తప్ప ప్రమాదాల గురించి ఆలోచించరు. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదం జరిగే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

**పలు ప్రమాదాలు**

ఇటీవల మైనర్లు వాహనాలు నడుపుతూ పలు ప్రమాదాలకు కారణమయ్యారు. ఈ ఘటనల్లో ఎదుట వారి ప్రాణాలు కూడా పోయాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు, వాహన యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 65 పైగా మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు.

**వాహన యజమానులపై కేసులు**

నగరంలో వివిధ పనుల నిమిత్తం నిత్యం రహదారిపై మనం రాకపోకలు సాగిస్తుంటారు. మన కళ్ల ముందే ఆకస్మాత్తుగా పెద్ద శబ్దంతో రయ్‌మని, ర్యాష్‌గా ద్విచక్ర వాహనాలు దూసుకెళుతూ ఉంటాయి. వాటిని మైనర్లు డ్రైవింగ్ చేస్తూ కనిపిస్తారు. వీరిలో కొందరు వివిధ పనులపై బయటకు వచ్చిన వారైతే, మరికొందరు తమ స్నేహితులతో కలిపి సరదాగా తిరుగుతున్నవారు ఉంటారు.

**బాధ్యతా రాహిత్యం**

మైనర్ల బాధ్యత లేని డ్రైవింగ్ కారణంగా రహదారి ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. డ్రైవింగ్ చేసే వయసు రాకుండా, లైసెన్సు లేకుండా మైనర్లు వాహనాలు నడిపారంటే దానికి తల్లిదండ్రులతో పాటు వారికి వాహనం ఇస్తున్న వారి తప్పు కూడా ఉంటుంది. పిల్లల ఆనందం కోసం ద్విచక్ర వాహనం ఇస్తూ పరోక్షంగా వారి బంగారు భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగితే వాహన యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

**వాహనం ఇవ్వడం నేరం**

మైనర్లకు వాహనం ఇస్తే కేసులు తప్పవని పోలీసులు ప్రచారం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తరువాత వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం కన్నా, ప్రమాదాలు జరగకుండా ముందుగానే అడ్డుకట్ట వేయడం ప్రధానమనే ఆలోచనతో చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకుండా నియంత్రించడానికి కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ, విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తున్నారు. డ్రైవింగ్‌లో పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుని ఆ వాహన యజమానులను, మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడుతున్నారు. మరోసారి వారికి వాహనం ఇవ్వకుండా ప్రథమ తప్పిదంగా హామీ పత్రం రాయించుకుంటున్నారు.

> **చర్యలు తప్పవు**
>
> మైనర్లకు వాహనాలిస్తే ఇచ్చిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం. పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలా మంది యువత డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నారు. వారిపైనా ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సురక్షిత డ్రైవింగ్ చేయాలి.
>
> – కె.జయప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, రాజమహేంద్రవరం

### ఆక్సిజన్ సిలిండర్ అందజేత

**నిడదవోలు రూరల్:** తాడిమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హైదరాబాద్‌కు చెందిన కేకే వేణుగోపాలస్వామి ఆర్థిక సహాయంతో ఆక్సిజన్ సిలిండర్ సోమవారం అందజేసినట్లు వైద్యాధికారి టి.ఆంద్రూ తెలిపారు. దాతల సహకారంతో ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించి రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

### సహకార శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** కోఆపరేటివ్ డిప్లమో ఇన్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్ 9వ బ్యాచ్ 24 వారాల సహకార శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని రాజమహేంద్రవరం రామదాసు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సహకార సంస్థలు, సహకార సొసైటీలలో పనిచేస్తున్న సిబ్బంది సహకార శిక్షణ పూర్తి చేసి ఉండాలనే నిబంధన ఉందన్నారు. సహకార చట్ట పరిధిలో రిజిస్టర్ అయిన సహకార సొసైటీల పాలకవర్గాలు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సహకార సొసైటీలు, సహకార బ్యాంకులు, సహకార సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి పదో తరగతి ఉత్తీర్ణత, ఇతరులకు ఇంటర్, దానికి సమాన అర్హత ఉండాలని, వారందరూ డిప్లమో కోర్సుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు 92478 83491 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



చిన్నారుల కోలాట ప్రదర్శన



కోలాట ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

**నల్లజర్ల:** వేసవి సెలవుల్లో విద్యార్థులు తమకు నచ్చిన అంశాలలో శిక్షణ పొందారు. కొందరు గ్రంథాలయాలలో పుస్తకపఠనం, చెస్ నేర్చుకుంటే మరి కొందరు యోగ, ఇంకొందరు కోలాట ప్రదర్శన నేర్చుకున్నారు. నల్లజర్లలో చిన్నారులంతా కోలాటం నేర్చుకున్నారు. ఇందుకు శ్రీరామకృష్ణ భక్తమందిరం వేదికైంది. వివిధ భజన మండళ్ల సభ్యులతో పాటు బొమ్మిరెడ్డి శ్రీను వీరందరికి నెలరోజుల పాటు కోలాటం నేర్పారు. మొదటి ప్రదర్శనను ద్వారకాతిరుమల చిన వెంకన్న స్వామి చెంత వేయాలని నిర్ణించి తల్లిదండ్రులతో కలసి స్వామి దర్శనం అనంతరం కోలాట ప్రదర్శన నిర్వహించి పలువురితో శభాష్ అనిపించుకున్నారు. ద్వారకాతిరుమల వెళ్లడానికి వీరికి భాష్యం, శశి విద్యాసంస్థలు బస్సులు ఏర్పాటు చేశారు.

## ఉమారామలింగేశ్వరుడిని దర్శించిన ఎమ్మెల్యే



స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు ఆశీర్వాదం అందిస్తున్న అర్చకులు

**దేవరపల్లి:** కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం దేవరపల్లిలోని పార్వతి సమేత ఉమారామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ముప్పిడికి స్వాగతం పలకగా, అర్చకులు వేద ఆశీర్వాదం ఇచ్చారు. అర్చకులు రాంబాబు ఎమ్మెల్యే వేంకటేశ్వరరావుకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌చార్జి డీఎస్పీ**

**కొవ్వూరు:** ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుని కొవ్వూరు ఇన్‌చార్జి డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలకు విఘాతం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, మాజీ మునిసిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, నాయుడు వీర్రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు తదితదిరులు పాల్గొన్నారు.

## ఆశ, ఏఎన్ఎంల వివాదం పరిష్కారం



పోతవరం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

**నల్లజర్ల:** పోతవరం పీహెచ్‌సీ వద్ద గత వారం రోజులుగా జరుగుతున్న ఆశ కార్యకర్తల ఆందోళన గ్రామపెద్దల జోక్యంతో సర్దిమణిగింది. గ్రామ సచివాలయం–2లో పని చేస్తున్న ఏఎన్ఎం రామలక్ష్మి తమ వద్ద పనిచేస్తున్న ఆశ కార్యకర్తలను కక్షపూరితంగా వేధిస్తోందని ఆమెపై చర్యలు తీసుకోవాలని ఆశ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన నేటితో 7వ రోజుకు చేరింది. సోమవారం గ్రామ సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఉపసర్పంచ్ ఏలేటి సత్యనారాయణ, గ్రామపెద్దలు సమావేశమై ఇరువర్గాలతో మాట్లాడారు. ఆశల తరఫున రాష్ట్ర సంఘ అధ్యక్షురాలు పోశమ్మ పాల్గొని ఆశలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. అక్కడ పని చేస్తున్న డాక్టరు రాజశేఖర్ కూడా తమ ఇబ్బందులు గ్రామపెద్దలకు వివరించారు. చివరకు ఏఎన్ఎం రామలక్ష్మి సెలవుపై వెళ్లేలా నిర్ణయించారు. దీంతో రామలక్ష్మి సెలవుపై వెళ్లిపోయారు. ఇందుకు ఆశ కార్యకర్తలు అంగీకరించారు. దీంతో అక్కడ ఆశ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన నేటితో ముగిసింది.

### ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రాజ్ మనోజ్

**కడియం:** వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మండల అధికారులకు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. గోదావరి పరివాహక ప్రాంతాలైన వేమగిరి, కడియపులంక, పొట్టిలంక గ్రామాల్లో వరదల ముంపుపై తీసుకోవాల్సిన చర్యలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. కడియం ఆవ ప్రాంతంలో దాదాపు 1100 ఎకరాలు ముంపు బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై వ్యవసాయాధికారులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, తగిన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలల వద్ద పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల జారీలో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాలు, పశువులకు సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున వెటర్నరీ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగీ, టైఫాయిడ్ వంటివి ఎక్కడైనా గుర్తిస్తే నీటి నాణ్యత పరీక్షలు కూడా చేయాలని ఆదేశించారు.

## వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ



చాగల్లులో దుక్కిదున్నుతున్న రైతు

**చాగల్లు:** వర్షాలు పడుతుండడంతో మండలంలో అన్నదాతలు పొలం పనులు ప్రారంభించారు. ఖరీఫ్ సాగుకు దుక్కి దున్నిన మడుల్లో వరివిత్తనాలు వేసే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. మండలంలోని చాగల్లు, నెలటూరు, మార్కొండపాడు, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి తదితర గ్రామాల్లో ఖరీఫ్ సాగుకు భూమిని సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వర్షాలు వస్తే జల్లిన విత్తనాలు మొలకలు వచ్చే అవకాశం ఉందని ఆయా ప్రాంతాల రైతులు చెబుతున్నారు. కొన్నిచోట్ల బోర్ల కింద వేసిన నారుమళ్లు తీత దశకు వచ్చాయి. రబీ ఆశాజనకంగా ఉండడంతో ఖరీఫ్ సాగు కూడా బాగుంటుందని ఆశతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు.

## గుర్రపుడెక్కతో ఇబ్బందులు



ఎస్.ముప్పవరంలో చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

**చాగల్లు:** ఎస్.ముప్పవరం గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువు నిండా గుర్రపు డెక్కతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువు వివాదం కోర్టులో ఉండడంతో చెరువును గత కొన్ని ఏళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు. దీనివల్ల అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కనీసం అధికారులు గుర్రపు డెక్కను తొలగించి చెరువు పరిసరాలు శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

## వీడియోగ్రాఫర్ల నిరసన



గోపాలపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీడియో గ్రాఫర్లు

**గోపాలపురం:** తమకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలంటూ సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన వీడియోగ్రాఫర్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల పూర్తయి 27 రోజులు కావస్తున్నా తమకు బకాయిలు చెల్లించలేదని, బకాయిలు అడిగితే తమను కనీసం మనుషులుగా కూడా చూడడం లేదని వీడియో గ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.26 లక్షలకు గానూ కేవలం రూ.6లక్షలు మాత్రమే చెల్లించారని మిగిలిన రూ.20లక్షలకు కనీసం సమాధానం కూడా ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో సుమారు 25 మంది వీడియో గ్రాఫర్లు విధులు నిర్వహించినట్టు తూర్పుగోదావరి జిల్లా వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గెల్లా రాజబాబు తెలిపారు. రెండు రోజుల్లో తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై తహసీల్దార్ డి.వనజాక్షిని వివరణ కోరేందుకు ప్రయత్నింగా ఆమె ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

## ప్రణాళికాబద్ధంగా విద్యాసంవత్సరం



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్

**కంబాలచెరువు:** నూతన విద్యా సంవత్సరాన్ని ప్రణాళికాబద్ధంగా ప్రారంభించాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అర్బన్ పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు – నేడుకు సంబంధించిన అన్ని పనులు ఈ నెల 12వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా చూడాలన్నారు. తరగతి గదులను శుభ్రం చేయించాలని, ఆర్వో ప్లాంట్లను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ సామగ్రి విద్యార్థుల బోధనకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. రన్నింగ్ వాటర్ సౌకర్యంతో మరుగుదొడ్లను అందుబాటులో ఉండాలన్నారు. ఎగ్, చిక్కీ, రాగి జావ, బెల్లం వంటి సామగ్రి ని ముందుగా సిద్ధపరచుకుని ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం స్టూడెంట్ కిట్ల పంపిణీ తేదీని ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి పాఠశాలలకు అందిన సామగ్రి వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ఐఎఫ్‌పీ పానెళ్లు, స్మార్ట్ టీవీలను వర్కింగ్ కండిషన్‌లో ఉండేలా చూడాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ నిర్వహించాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ఆధారంగా బోధన నిర్వహించాలని, అడ్మిషన్లకు ప్రత్యేక ర్యాలీలు నిర్వహించి, ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు.

**ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకు సూచనలు**

ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలతో అర్బన్ డీఐ దిలీప్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వంటగది పరిశుభ్రంగా ఉండాలని, గుడ్లు ఉడికించే ముందుగా వాటి నాణ్యతను చూడాలన్నారు. కూరగాయలను పరిశుభ్రంగా కడిగి వండాలన్నారు. పాడైపోయిన గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదన్నారు. ఇటీవల నిర్వహించిన శిక్షణలో తెలిపిన సూచనలను పాటించి, వంట చేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో రమా రజని, ఎస్కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కోటేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం

**కడియం:** దామిరెడ్డిపల్లిలోని మండల పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ పాట్రన్ డి.రత్నరాజు బైబిలు మిషన్ మందిరంలో సోమవారం వైద్య శిబిరం జరిపారు. రత్నరాజు తండ్రి అర్లపరాజు జ్ఞాపకార్థం రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని సర్పంచ్ ముద్రగడ జెమి, ఎంపీటీసీ విత్తనాల సాయికుమార్ ప్రారంభించారు.